## క్లుప్తంగా

### మల్లన్న సేవలో మాజీ మంత్రి

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైలశ్రీ భ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను గురువారం మాజీ మంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

### సంక్షేమ పథకాలు కొనసాగించాలి

**ఆత్మకూరు:** రాష్ట్రప్రభుత్వం దళితులకు సంక్షేమ పథకాలు కొనసగించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్ లో గురువారం కేవీపీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ఎస్సీ కార్పొరేషన్‌ద్వార నిధులు కేటాయించాలని, వారికి ప్రభుత్వం అందిస్తున్న 27 సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు

### పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డీఆర్‌ఓ

**మహానంది:** పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అటవీశాఖ నంద్యాల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుబ్బయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల ఆవరణలో గురువారం పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, అడవుల సంరక్షణ ద్వారానే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ ప్రతాప్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం



**పగిద్యాల:** కిందికి వ్రేలాడుతున్న విద్యుత్ తీగలను తగులుకుని పశుగ్రాసం దగ్ధమైన ఘటన గురువారం పగిద్యాలలో చోటు చేసుకుంది. పాలమర్రి గ్రామానికి చెందిన మార్కండేయ అనే వ్యక్తి రూ. 24 వేలకు రెండెకరాల వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో మిడుతూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీస్ అవుట్‌పోస్టు వద్ద విద్యుత్ తీగలు తగిలి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంతో చెలరేగిన మంటలకు రెండెకరాల పశుగ్రాసం కాలిబూడిదైంది. సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న ట్యాంకర్‌తో నీటిని తెప్పించి పెనుప్రమాదం చోటుచేసుకుండా మంటలను అర్పివేశారు. ఈ సమాచారం అందుకున్నా ముచ్చుమర్రి పోలీసులు కూడా మనుష్యులను పురమాయించి మంటలను కట్టడికి కృషి చేశారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, స్థానికులు సకాలంలో స్పందించడంతో ఏలాంటి ప్రాణ నష్టం చోటు చేసుకోకపోడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

### రేషన్ బియ్యం తరలిస్తే క్రిమినల్ కేసులే

**నందికొట్కూరు:** పేద ప్రజల ఆకలి తీర్చే పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని సాయిబాబాపేటలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన అబ్దుల్ హబీజ్‌కు చెందిన 45 కేజీల 24 ప్యాకెట్లు, మారుతీనగర్‌లో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన అల్తాఫ్ హుసేన్ చెందిన 45 కేజీల 23 ప్యాకెట్లు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**మహానంది:** జగనన్న కాలనీల్లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ జనార్దనశెట్టి తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్ జనార్దనశెట్టి మాట్లాడారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునే ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ వాసుదేవుడు మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకుంటే దశల వారీగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ, కార్యదర్శి నాగసంజీవరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# పాత బ్రిడ్జీలకు మోక్షం!

- రూ. 3.406 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



దెబ్బతిన్న పగిద్యాల బ్రిడ్జి



శిథిలావస్థలో ఉన్న పాత ముచ్చుమర్రి బ్రిడ్జి

**పగిద్యాల:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రధాన్యతనిస్తుంది. మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిద్యాల గ్రామాలలో కేసీ కాలువపై దెబ్బతిన్న బ్రిడ్జీల స్థానంలో డబల్ లైన్ నూతన బ్రిడ్జీల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇస్తూ రూ. 3.406 కోట్ల నిధులు కేటాయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాష్ట్ర శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సిద్ధార్థరెడ్డి చేసిన అభ్యర్థన మేరకు సీఎం స్పందించి ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయగా పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు శాప్ చైర్మన్ పేర్కొన్నారు. పగిద్యాల బ్రిడ్జికి రూ. 1.926 కోట్లు, పాత ముచ్చుమర్రి బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.480 కోట్లు కేటాయిస్తూ పరిపాలన అనుమతులు ప్రిన్సిపల్ సెక్రటరీ ఈనెల 4న జారీ అయ్యింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పరిపాలన అనుమతులు వచ్చాయి**

మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిద్యాల గ్రామాలలో కేసీ కెనాల్‌పై డబల్ లైన్ నూతన బ్రిడ్జిల నిర్మాణానికి పరిపాలన అనుమతులు వచ్చాయి. రూ. 3.406 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంకా లెటర్ మా వరకు రాలేదు.

– నరేష్, ఏఈ. నీటిపారుదల శాఖ, పగిద్యాల

**చాలా సంతోషంగా ఉంది**



డబల్ లైన్ నూతన బ్రిడ్జి నిర్మాణానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నిధులు మంజూరు చేయించడం చాలా సంతోషంగా ఉంది. ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఉండడం ప్రజలు చేసుకున్నా అదృష్టం. ఇప్పటికే మండలానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేసి క్రీడాకారులకు అభ్యున్నతికి బాటలు వేశారు.

– పెరుమాళ్ల శేషన్న, సర్పంచ్, పగిద్యాల

**ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం**



కేసీ కెనాల్‌పై నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన సింగిల్ లైన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కింది అడుగు భాగంలో ఇనుప చువ్వలు బయటపడి పెచ్చులూడుతోంది. భయాందోళనతోనే బ్రిడ్జిపై తిరుగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి తీసుకెళ్లాం. ఆయన ప్రత్యేక చొరువ తీసుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిపాలన అనుమతులు వచ్చాయి. సీఎంకు రుణపడి ఉన్నాం.

– బోయ మధు, ముచ్చుమర్రి

### ఉపాధి పనులు పరిశీలన

**పగిద్యాల:** మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో జరిగే ఉపాధి పనులను ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ మద్దిలేటి గురువారం పరిశీలించారు. అనంతరం కూలీలతో ఎంపీడీఓ మాట్లాడుతూ పని ప్రదేశంలో ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారో వారి పేర్లను మాత్రమే మస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పనికి రాని కూలీల పేర్లు బోగస్ హాజరు కింద నమోదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నం

**ఆత్మకూరు:** పట్టణంలోని సాయిబాబ నగర్‌లో గురువారం ఉదయం మార్నింగ్ వాక్ కు వెళ్లిన ఓ మహిళ మెడలోని చైన్‌ను అపహరించేందుకు చైన్ స్నాచర్ ప్రయత్నించాడు. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఉదయం కవిత అనే మహిళ మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా చైన్‌స్నాచర్ ఆమె మెడలోని చైన్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించాడు. దాదాపు 3, 4నిమిషాల పాటు ఇరువురి మధ్య ఘర్షన జరిగింది. దొంగ మహిళను వదిలి పొలాల వైపు పరిగెత్తాడు.

కవిత పోలీసులకు, బంధువులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం పోలీసులు, బంధువులతో పాటు కవిత పొలాల వెంట దొంగవెళ్లిన ప్రాంతంలో వెతికారు. ఆ ప్రాంతంలో చైన్‌స్నాచర్ ను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

**నందికొట్కూరు:** ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామానికి చెందిన పోతుల వెంకటేశ్వరమ్మ ఆరోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన రూ. 1. 20 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అమలు చేస్తుందని తెలిపారు. వైద్యానికి సీఎం వైఎస్ జగనన్న పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సాలుమండపాలు కళాత్మకంగా ఉండేలా చర్యలు

- శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలిచైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి
- శ్రీశైలక్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన చైర్మన్



ఇంజినీరింగ్ పనులను పరిశీలిస్తున్న దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల ప్రధానాలయానికి ముందు భాగంలో గల శివవీధిలో నిర్మించే సాలుమండపాలు కళాత్మకంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దేవస్థానం అధికారులకు సూచించారు. గురువారం శ్రీశైలక్షేత్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను చైర్మన్ పరిశీలించారు. ముందుగా ప్రధానాలయ ముందుభాగంలోని శివవీధులు, అంకాలమ్మ ఆలయం, సిద్దరామప్ప వాణిజ్య సముదాయంలో పైఅంతస్తులో చేపట్టిన గదులు నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రధానాలయంలో తూర్పు భాగంలోని రహదారిలో ఇరువైపుల ఉన్న దిబ్బలను తొలగించాలని అధికారులకు సూచించారు. భక్తులు ప్రభోత్సవం, రథోత్సవం, గ్రామోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఈ మండపాలలో ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా ఈ వీధులల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రధాన రహదారికి ఎడమవైపున గల రమణమూర్తి సత్ర భవన స్థితి గతులను పరిశీలించాలన్నారు. అనంతరం అంకాలమ్మ ఆలయం మరమ్మత్తులు, సిద్దిరామప్ప వాణిజ్య సముదాయంలో యాత్రికుల వసతి కోసం చేపడుతున్న సూట్ గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రామకృష్ణ, ఎమ్ నరసింహారెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న, ఏఈలు భవన్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేషస్పందన

**ఆత్మకూరు:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తుందని రాష్ట్ర షేక్‌కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్ అలీ పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి బండిఆత్మకూరు మండలంలో 100 రోజుల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారన్నారు. ఎమ్మెల్యే నిర్వహిస్తున్న కార్యక్రమానికి భారీ స్పందన లభించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా పూర్తిచేసిన పథకాలను ఎమ్మెల్యే వివరిస్తూ పట్టణాలు, పల్లెలు తిరుగుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యేలకు ఎంతో ఉపయోగకరంగాఉంటుందని,గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని ఈ ప్రభుత్వం ముందుకు నడుపుతుందని చెప్పారు

## పర్యావరణాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

**కొత్తపల్లి:** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుని పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలోని డీఎస్‌టీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సర్పంచ్ మశమ్మ ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనమందరం ఏకంగా పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు కృషి చేయాలని కోరారు. పర్యావరణం పరిరక్షించబడాలంటే గ్రామాలలో పచ్చదనం మెరుగుపడాలని వివరించారు. పర్యావరణరహిత జీవనశైలి పై గ్రామస్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వస్తువులు వద్దు....పేపర్ వస్తువులే ముద్దు అంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ గురువయ్య, ఎఫ్‌బీఓలు లక్ష్మీదేవి, సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ సోమల స్రవంతి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, చంద్రమౌలి, ప్రొటెక్షన్ వాచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులపై ఎంఈఓ ఆగ్రహం

**పగిద్యాల:** పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థుల అభ్యున్నతి కోసం నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాస్‌లకు గైర్హాజరవుతున్నా ప్రధానోపాధ్యాయులపై మండల విద్యాధికారి సుభాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పాత ముచ్చుమర్రి, నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే రెమిడియల్ క్లాస్‌లను ఎంఈఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల ఒకటవ తేదీ నుంచి రెమిడియల్ తరగతులు ప్రారంభం కాగా పాత ముచ్చుమర్రి, నెహ్రూనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొసల్యాబాయి, శేఖర్ ఒక్క రోజు మాత్రమే క్లాస్‌కు వచ్చారని విద్యార్థులు ఎంఈఓ దృష్టికి తెచ్చారు. టైం టేబుల్ ప్రకారం ఉపాధ్యాయులు హాజరు కావడం లేదని ఎంఈఓ తనిఖీలో గుర్తించి హెచ్‌ఎంపై డిప్యూటీ ఈఓ మహబూబ్ భేగ్, డీఈఓ అనురాధకు రిపోర్ట్ పంపామని ఆయన పేర్కొన్నారు.

### బీపీ మండల్ కమిషన్ నివేదికను అమలు చేయాలి

**నందికొట్కూరు:** బీపీ మండల్ కమిషన్ నివేదికను అమలు చేయాలని బీసీ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శంకర్‌గౌడ్ కోరారు. గురువారం పాములపాడు మండల కేంద్రంలోని బీసీ ఐక్య సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు విద్య, ఉద్యోగ, చట్ట సభల్లో న్యాయమైన వాటా పొందినప్పుడే బీపీ మండల్ కమిషన్ అమలు జరిగినట్లన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సంజీవరాయుడు, వేణుగోపాల్, రాంమోహన్, మురళి, వాసు, శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బండిఆత్మకూరులో 101వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

**మహానంది:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద వర్గాలకు చెందిన ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం బండిఆత్మకూరులో 101వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు వివరించారు. మూడేళ్లలో ఒక్కో ఇంట్లో ఎంత మేరకు లబ్ధి పొందారో, ఏఏ పథకాల ద్వారా ఎంత నగదు అందిందో వివరిస్తూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో వెన్నుదన్నుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే లబ్ధిదారులను కోరారు. మళ్లీ మాకు సీఎంగా జగనే కావాలంటూ లబ్ధిదారులు ముక్తకంఠంతో చెప్పారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలన్న ఆకాంక్షతో కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు సంక్షేమ పథకాల పంపిణీ దండగ అంటూ దుర్మార్గంగా ఆరోపణలు చేస్తుండటం బాధాకరమన్నారు. ప్రజా సంక్షేమాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ ముంతల మధురాణి, పుల్లయ్య, నాయకులు అవుటాల నాగేశ్వరరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాబురెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, దీపకాంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు సుబ్రహ్మణ్యంరెడ్డి, పరమటూరు శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

### నేడు గడపగడపకు మనప్రభుత్వం

**మహానంది:** మండల కేంద్రం బండిఆత్మకూరులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

**నేడు పారుమంచాలలో....**

**జూపాడుబంగ్లా:** మండలంలోని పారుమంచాల గ్రామంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సమక్షంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి, సర్పంచ్ ప్రకాశం తెలిపారు. కార్యక్రమానికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు. ఎమ్మెల్యే ఇంటికీ వెళ్లి ఇప్పటిదాకా ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించటంతోపాటు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

### బాబా గుడి నిర్మాణానికి విరాళం

**పగిద్యాల:** మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న సాయిబాబా గుడి నిర్మాణ నిమిత్తం మండల ఉపాధ్యాయులు రూ. 15,000 విరాళంగా అందజేశారు. గురువారం ఎంఈఓ సుభాన్ ఆలయ కమిటీ సభ్యులు సాయివిజయకు నగదు అప్పగించారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బాబా గుడి కోసం విరాళం అందజేయడం హర్షనీయమని ఎంఈఓ పేర్కొన్నారు.

### కూలీలందరికీ ఉపాధి పనులు

**నందికొట్కూరు రూరల్ :** గ్రామీణ ప్రాంతాలలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అధికారులు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీడీ ఏసుదాసు సూచించారు. గురువారం పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో మేటీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కొలతలను ఇచ్చి వాటి ప్రకారం పనిచేయించాలని, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి రోజూ మస్టర్‌లలో కూలీల సంతకాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవోలు అలివేలు మంగమ్మ, కాసీం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు ఇస్మాయిల్, పరమేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లకు సేవా పథకాలు

**నందికొట్కూరు:** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించిన వార్డు వలంటీర్లకు ప్రభుత్వం సేవా పథకాలు అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 కుటుంబాలకు ఒక వలంటీర్ సేవలందించేందుకు ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించే వలెంటీర్లకు ప్రభుత్వం పురస్కారాలు అందించేందుకు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు వార్డుల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు చెప్పారు. 19న కుర్వపేట సచివాలయం, 20న బీఆర్ఆర్ నగర్, 23న వాల్మీకినగర్, 24న జైకిసాన్ పార్కు, 25న ముబారక్ ఫంక్షన్ హాల్, 26న సంగయ్యపేట సచివాలయ, 27న ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు పురస్కారాల కార్యక్రమాలు చేపడుతునట్లు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే శిల్పాను సన్మానించిన కార్మికులు



ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న ఇటుక బట్టీల కార్మికులు

**ఆత్మకూరు:** పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఇటుకబట్టీల కార్మికులు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, సోదరుడు శిల్పాభువనేశ్వరరెడ్డిని దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటుకబట్టీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ప్రభుత్వం నుంచి అందే అన్నిరకాల సంక్షేమ పథకాలను అందజేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ కలిముల్లా, వార్డు కౌన్సిలర్‌సభ్యులు, ఇటుకబట్టీల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు



అక్రమంగా మట్టితవ్వకాలు చేస్తున్న వ్యక్తితో మాట్లాడుతున్న గ్రామస్తులు

**జూపాడుబంగ్లా:** పారుమంచాల చెరువులో అక్రమ మట్టితవ్వకాలను గురువారం ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. కర్నూలు పట్టణానికి చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి మిడ్తూరు మండలంలోని అలగనూరు గ్రామ రెవెన్యూ పరిధిలో పొలాన్ని కొనుగోలు చేశాడు. ఆయన పొలానికి తహసీల్దార్, గ్రామ సర్పంచ్ అనుమతుల్లేకుండా చెరువులో అక్రమంగా మట్టిని ప్రొక్లెయిన్‌తో తవ్వి టిప్పర్లతో తన పొలానికి తరలించుకుంటున్నాడు. పారుమంచాల గ్రామానికి చెందిన మోహన్‌రావు పేరున ఎలాంటి సర్వేనంబర్ కనపర్చకుండా మైనర్ ఇరిగేషన్ అధికారుల నుంచి 2వేల క్యూబిక్‌మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకొన్నట్లు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలిసిన పారుమంచాల గ్రామ ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగరత్నం, స్వామిదాసు, అనిల్‌కుమార్ తదితరులు మట్టితవ్వకం చేస్తున్న ప్రాంతానికి చేరుకొని రిటైర్డ్ పోలీసు అధికారిని నిలదీశారు. దీంతో ఆయన చూపించిన నకిలీ అనుమతి పత్రాన్ని చూపి సర్వేనంబర్‌లేకుండా తమ గ్రామంలో లేని వ్యక్తి పేరున మట్టితవ్వకానికి అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. చెరువులో తవ్విన మట్టిని పారుమంచాల గ్రామానికి కాకుండా ఇతర అలగనూరు, వాడాల గ్రామాలకు ఎలా తరలిస్తారని మట్టితవ్వకాలను నిలిపివేశారు. ఈ విషయమై తహసీల్దార్ పుల్లయ్య దృష్టికి తీసుకెళ్లగా రిటైర్డ్ విజిలెన్స్ పోలీసు అధికారిణి అని చెప్పడంతో మట్టితవ్వకానికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మట్టితవ్వకం సమస్యగా మారటంతో నిలిపివేయించినట్లు తహసీల్దార్ పుల్లయ్య తెలిపారు.

## నదిలో బోటు కనపడితే సీజ్ చేస్తాం

- సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం



బోటు నిర్వహకులకు సూచనలు చేస్తున్న ఆత్మకూరు సీఐ ఆర్‌జీ. సుబ్రహ్మణ్యం

**కొత్తపల్లి:** కృష్ణానదిలో బోట్లు నడుపుతూ కనపడితే సీజ్ చేస్తామని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని జనాలగూడెం, సిద్ధేశ్వరం, బలపాలతిప్ప, కపిలేశ్వరం గ్రామాల మత్స్యకారులు, బోటు నిర్వహకులతో సంగమేశ్వరంవద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదిలో బోట్లు తిప్పకూడదన్న ఉన్నతాధికారుల నిబంధనలు ఉన్నాయని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాతసిద్ధేశ్వరం నుంచి నాటు పుట్టీలలతో ప్రయాణికులను తెలంగాణకు చేరవేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో పోలీసుల నిఘా ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు బోట్లు సీజ్‌చేస్తామని అన్నారు. నిబంధనలు అతిక్రమించి నాటు పుట్టీలలో ప్రయాణికులను తెలంగాణకు చేరవేస్తున్న 5 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఆయన వెంట ఏఎస్‌ఐ బాబా పక్రుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుల్లు ప్రసాద్‌నాయక్, వెంకటేష్‌లు ఉన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఉండాలి

**పగిద్యాల:** గ్రామ సచివాలయాలలో విధులు నిర్వహించే అన్ని శాఖల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ వెంకటరమణ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మాపురం 3 సచివాలయంను ఎంపీడీఓ అకస్మీకంగా సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహించి అన్ని రికార్డులను పరిశీలించారు. స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పరిష్కారం కాని వాటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తేవాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సు వేళలు ఎప్పుడు ఉంటే అప్పుడు రావడం, వెళ్లడం చేస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. కార్యాలయంలో 5 గంటల వరకు తప్పనిసరిగా ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ వెంట ఈఓఆర్డీ పుల్లయ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.